క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శివకుమార్

భామిని: మండలంలోని బాలేరు పీహెచ్‌సీలో గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు డాక్టర్ డి.శివకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది 36 మంది గర్భిణులను పరిశీలించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గర్భిణులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నప్రాసన



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని పెదగుడబ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు, పౌష్టికాహార పంపిణీ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఐసీడీఎస్ పెదగొడబ సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ సీహెచ్ గౌరమ్మ, తదితరులున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు



నదిలో వాహనాలు అడ్డుకుంటున్న తహసీల్దార్, సిబ్బంది

కొమరాడ: మండలంలోని కూనేరు రామభద్రపురం సమీపంలో నాగవళి నది నుంచి అక్రమంగా ఇసుకు తరలించేందకు అక్రమార్కులు రంగం సిద్ధం చేశారు. గురువారం అర్ధరాత్రి చైన్‌మిషన్ సాయంతో లారీలతో అక్రమంగా తరలించారని స్థానికులు అంటున్నారు. శుక్రవారం ఉదయం తహసీల్దార్ రమేష్ తమ సిబ్బందితో అక్కడకు వెళ్లి ఇసుక అక్రమ రవాణాకు పాల్పుడతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసినా చట్టప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



కుర్చీలను వితరణగా అందజేస్తున్న శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి అంధవరపు శ్రీనివాసరావు రూ.4వేలు విలువైన కుర్చీలను వితరణ చేశారు. పాఠశాల హెచ్‌ఎం టి.శంకరరావుకు శుక్రవారం వాటిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించేందుకు ముందుకురావడం శుభపరిణామమన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



గర్భిణుల ఆరోగ్యంపై సూచనలు చేస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

గరుగుబిల్లి: గర్భిణుల ఆరోగ్య సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి సంతోషకుమార్ అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీల్లో పీఎంఎస్ ఎంఏ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు నిర్వహిస్తున్న తనిఖీలు, వైద్య పరీక్షలు, మాతాశిశు సంరక్షణ కార్డులను ఆయన పరిశీలించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామీణ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గర్భిణులకు సూచించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్రస్థాయిలో గర్భిణులకు వైద్యసేవలు అందించడంలో సేవా దృక్పదాన్ని కనబరచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చిన్నమ్మి, రమణమ్మ, ఉదయకుమారి తదితరులున్నారు.

ఆదివాసీ హక్కులను పరిరక్షించాలి..

- పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి
- గొయిదిలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం

సీతంపేట: ఆదివాసీ హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని గొయిది గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆదివాసీ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. ఆదివాసీ నృత్యాలతో అలరించారు. చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీ ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. గిరిజన రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. జీఓ 3ను పునరుద్ధరించాలన్నారు. బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులాలను గిరిజనులుగా ఆమోదించి, శాసనసభలో చేసిన తీర్మానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన యూనివర్సిటీని గిరిజన నియోజకవర్గంలోనే నిర్మించాలన్నారు. కురుపాం ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. అలాగే గిరిజన శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, పార్టీ నాయకులు హెచ్.మోహనరావు, బి.సరోజిని, చంద్రశేఖర్, అబ్బాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

సీతంపేట: గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సీతంపేట ఐటీడీఏలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక అడ్వెంచర్ పార్కు నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఆదివాసీ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీఓ 3 పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. రహదారులు, తాగునీటి సదుపాయలు కల్పించనున్నట్లు చెప్పారు. ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఏపీఓ చిన్నబాబు, పీహెచ్‌ఓ గణేష్, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, ఈఈ సింహాచలం, గిరిజన సంఘ నాయకులు బి.తేజేశ్వరరావు, పి.పుృషోత్తం, లక్ష్మీనారాయణ, ప్రమోద్ పాల్గొన్నారు.



సీతంపేట: ఆదివాసీ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసిన మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు



సీతంపేట: ఆదివాసీ తల్లి విగ్రహానికి పూలదండలు వేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, పీఓ రాహుల్‌కుమార్‌రెడ్డి



పాలకొండ రూరల్: గిరిజన వేషధారణలో ఆర్‌సీఎం ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు

ఆర్‌సీఎం పాఠశాలలో..

పాలకొండ రూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక ఆర్‌సీఎం పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈక్రమంలో గిరిజనుల జీవన విధానంపై విద్యార్థులు ప్రదర్శనిలిచ్చారు.

– గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన గిరిజనులతో కలిసి స్థానిక వైటీసీ నుంచి భద్రగిరి, ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. జై ఆదివాసీ నినాదాలతో మండల కేంద్రం మార్మోగిపోయింది. అనంతరం వైటీసీలో గిరిజన ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు, యువత సంప్రదాయ వేషధారణలతో అలరించారు. డప్పు వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేశారు.



గరుగుబిల్లి: ఆదితల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న పారినాయుడు, తదితరులు



గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీ దినోత్సవంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: ఆదివాసులు అడవితల్లి ముద్దుబిడ్డలు. అడవితో వారికి విడదీయలేని బంధం ఉందని, వారు ప్రకృతిని దైవంగా భావిస్తారని జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తోటపల్లిలో శుక్రవారం ఆదితల్లి విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఆగస్టు 9ని ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఆదివాసీల హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు ఆదివాసులకు అండగా నిలబడిన వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు టి.శివాజీ, ఎం.వాసుదేవరావు, ఎస్.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

గిరిజనులు మరింత అభివృద్ధి చెందాలి

- జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



గిరిజన మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కొమరాడ: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు వ్యవసాయంతో మరింత అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా కొమరాడ మండలంలో ఆయన పర్యటించారు. చోళ్ళపదం పంచాయతీ ఇందిరనగరం గ్రామంలో గిరిజనులతో కలిసి ముఖాముఖి మాట్లాడారు. గ్రామంలో గిరిజన యువతకి ఉపాధి అవకాశాలు ఏవిధంగా ఉన్నాయి, ఉద్యోగాలు చేస్తున్నారా లేదా తదితర వివరాలు ఆరా తీశారు. వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులతో మాట్లాడి వారి పెట్టుబడులు, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గిరిజన యువత చదువుకొని మంచి ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కాసేపు వాలీబాల్ ఆడారు. విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి ఎస్.సేతుమాధవన్, మండల అధి కారులు, వివిధ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో గిరిజనుల జీవితంలో వెలుగులు

- మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపారని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనుల కోసం చేసిన అభివృద్ధిని వివరించారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న కొండపోడు భూములకు పట్టాలు లేక ఆవేదన చెందుతున్న గిరిజనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి ఏడాదిలోనే 2,70,000 ఎకరాలపై 1,50,000 మందికి హక్కును కల్పిస్తూ ఆర్‌ఓఎఫ్‌ఆర్, డీకేటీ పట్టాలు ఇచ్చారని, అలాగే వారికి రైతుభరోసా నగదును కూడా అందజేశారన్నారు. 24 డీబీటీ పథకాలు, 7 నాన్ డీబీటీ పథకాల ద్వారా సుమారు రూ.15,000 కోట్లతో గిరిజనులకు లబ్ధిని చేకూర్చారన్నారు. పాడేరులో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీని, వెనుకబడిన ప్రాంతమైన కురుపాం నియోజకవర్గంలో రూ.150 కోట్లతో గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేశారన్నారు. ఈ పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. సచివాలయాల ఉద్యోగాలు పేరుతో వేల మంది గిరిజనులకు సొంత గ్రామాల్లోనే రెగ్యులర్ ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. గిరిజనుల హక్కులు పరిరక్షించాలన్న ఉద్దేశ్యంతో గిరిజనులే పోటీ చేసేవిధంగా చట్టం చేసి అమలు చేశారని, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన గిరిజన అభివృద్ధిని, అంతకు ముందు జరిగిన అభివృద్ధితో బేరీజు వేసుకుంటే స్పష్టంగా అర్థమౌతుందన్నారు.

అంతర పంటలతో ఆదాయం



పత్తిపంటను పరిశీలించి సూచనలు చేస్తున్న ప్రొఫెసర్ వెంకటరమణ, వాస్సన్ ప్రతినిధులు

భామిని: కొండ ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటలతో అధిక ఆధాయం పొందవచ్చని వాస్సన్ సంస్థ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. మండలంలోని కారిగూడ, వెంకటగూడలలో సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న పత్తి పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్తి పంటలో వరుసుల మధ్య జొన్న, మొక్కజొన్న, కంది, బెండ, ఆముదం, బంతి సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. సేంద్రియ దిగుబడులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. కార్యక్రమంలో వాస్సన్ ప్రతినిధులు కల్యాణ్ పాత్రో, డి.శంకరరావు, కీర్తిరాయి సుగ్రీవులు, బిడ్డిక లోకనాథం, గిరిజన రైతులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన



సంపద తయారీపై వివరిస్తున్న పార్టీ నాయకుడు వలరౌతు రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు

భామిని: మండలంలోని కీసర పంచాయతీలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్‌డీ జి.కృష్ణారావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో భాగంగా సర్పంచ్‌లు, కార్యదర్శులను క్షేత్ర పరిశీలనకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కీసర పంచాయతీ సర్పంచ్ వలరౌతు పద్మావతి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వలరౌతు రామకృష్ణ వర్మీకంపోస్టు ఎరువు తయారీని వివరించారు. అలాగే కంపోస్టు ఎరువుతో సాగు చేస్తున్న కిచెన్ గార్డెన్ నిర్వహణపై కూడా అవగాహన కల్పించారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ బృందాలతో సమావేశమైన అధికారులు

వీరఘట్టం : మండలంలోని 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సోషల్ ఆడిట్ బృందాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం, ఐటీడీఏ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో రూ.21.28 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనుల్లో నాణ్యత, చేసిన ఖర్చులు, తదితర వివరాలను పక్కాగా ఆడిట్ చేయాలని సూచించారు. సమావేశంలో మండల ఇంజినీరింగ్ అధికారి డి.కల్యాణిదుర్గ, ఏపీఓ జి.సత్యంనాయుడు, ఎస్ఆర్‌పీ డి.దాసు పాల్గొన్నారు.

సమష్టికృషితో పంచాయతీల అభివృద్ధి

పాలకొండ రూరల్



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ

ప్రజా ప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారుల సమష్టి కృషితో గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాటలో నడుస్తాయని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు జరగుతున్న శిక్షణ రెండోరోజైన శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీ, విక్రయం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని అన్నవరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద కిచెన్ గార్డెన్ కార్యక్రమంలో భాగంగా క్లాప్‌మిత్రలకు కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, తదితరులున్నారు.

లక్ష్యాలు పూర్తి చేయండి..



బుక్కూరులో గృహ నిర్మాణాల తాజా పరిస్థితులను పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: గృహ నిర్మాణాలకు సంబంధించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ రవి ఆదేశించారు. మండలంలోని బుక్కూరు, నవగాం, తుమరాడ, పనుకువలస గ్రామాలతో పాటు అర్బన్ కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాల తాజా పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పనులు వేగవంతం చేసి క్షేత్రస్థాయి సిబ్బంది లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలన్నారు. బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మాధవరావు, సిబ్బంది ఉన్నారు.

విగ్రహాల ధ్వంసం సరికాదు..

పాలకొండ రూరల్: విజయవాడ స్మృతివనంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం సరికాదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కొంతమంది దుండగులు విగ్రహంపై దాడి చేయడంతో పాటు పరిసరాలను చిందరవందర చేయడాన్ని ఖండిస్తూ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, దళిత ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పాలకొండలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.

అంబేడ్కర్ జాతి సంపద



డాక్టర్ బీర్ అంబేడ్కర్ జాతి సంపద. అటువంటి మహనీయుడి విగ్రహంపై దాడి హేయమైన చర్య. ఈ దుశ్చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఈ సంఘటనపై కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. ఏ చిన్న సంఘటన జరిగినా హడావిడి చేసే మీడియా ఇప్పుడు కూడా స్పందించాలి. – యందవ రాధాకుమారి, నగరపంచాయతీ చైర్‌పర్సన్, పాలకొండ

ఎవరి మెప్పుకోరి..?



ఎవరి మెప్పు పొందాలని అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి పాల్పడ్డారో నిగ్గుతేల్చాలి. తక్షణమే స్పందించి బాధ్యులను గుర్తించకుంటే ప్రభుత్వాన్నే అనుమానించాల్సి ఉంటుంది. రాష్ట్ర నడిబొడ్డున వేలాది మంది ప్రజలు, అధికారులు ఉంటుండగా ఈ సంఘటన జరిగినట్లు స్పష్టమవుతోంది. లిల్లీ పుష్పనాథం, దళిత సంఘాల నాయకుడు, పాలకొండ

ఉద్యమిస్తాం..



నిమ్నజాతుల ఆశాజ్యోతి అంబేడ్కర్. ఆయనను గౌరవిస్తూ గత ప్రభుత్వం విజయవాడలో స్మృతి వనం ఏర్పాటు చేసింది. జాతి గర్వించేలా భారీ విగ్రహం ఏర్పాటు చేసింది. దీనికి కూడా రక్షణ కల్పించకుంటే ఎలా. ప్రభుత్వం తీరును ఎలా చూడాలి. అంబేడ్కర్‌ను ఏ కోణంలో చిన్నచూపు చూసినా ఉవ్వెత్తున ఉద్యమిస్తాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. బాధ్యులను గుర్తించాలి. కొంచాడ జాన్, దళిత నాయకుడు, పాలకొండ

హేయమైన చర్య:



అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి పాల్పటం హేయమైన చర్య. ప్రభుత్వం ఈ తరహా ఘటనలపై కఠినంగా వ్యవహరించాలి. అంతమంది పోలీసులు, భద్రత ఉన్న విజయవాడలో ఈ ఘటన జరటం నిఘా వైఫల్యానికి నిదర్శం. తక్షణమే కారకులపై చర్యలు చేపట్టాలి. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంది. పోలీస్ యంత్రాంగ దృష్టి పెడితే అగంతకులు తప్పించుకోలేరు. లేకుంటే దీని వెనుక అధికారిక రాజకీయ శక్తులు ఉన్నట్లే అనుకోవాల్సి వస్తుంది. – దుప్పాడ పాపినాయుడు, కౌన్సిలర్, పాలకొండ నగర పంచాయతీ

ప్రభుత్వం సమాధానం చెప్పాలి..



విజయవాడలో చోటుచేసుకున్న ఈ దుశ్చర్యపై ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. బలహీన వర్గాల బలమే అంబేడ్కర్. అటువంటి మహనీయుడి విగ్రహంపై దాడి చేయడం సిగ్గుచేటు. యంత్రాంగం తక్షణమే స్పందించి బాధ్యులను శిక్షించాలి. – తిర్లంగి ఉపేంద్రకుమార్, మండల సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు, పాలకొండ

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు..



వీరఘట్టం: భక్తులచే పూజలందుకున్న వీరఘట్టం కోటదుర్గమ్మ



వీరఘట్టం : పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



సీతంపేట: సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శ్రావణమాస మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిలాడాయి. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. – సీతంపేట/వీరఘట్టం

విద్యార్థులకు క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం వివిధ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రిన్స్‌పాల్ హరగోపాల్ నేతృత్వంలో చేపట్టిన ఈ పోటీల్లో బాల బాలికలు ఉల్లాసంగా..ఉత్సాహంగా పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టెన్నీకాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, పరుగు పందె పోటీలు నిర్వహించారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందిస్తామని వ్యాయామ అధ్యాపకుడు ఎస్. నాగభూషణరావు, అధ్యాపకులు వెలమల అప్పారావు, గోవిందరావు, తదితరులు తెలిపారు.